క్లుప్తంగా

చలివేంద్రాల ఏర్పాటుపై సమీక్ష

పెద్దతిప్పసముద్రం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా ప్రతినిధులు, అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవిలో ఎండ తీవ్రత, వాతావరణ శాఖ ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దృష్టిలో ఉంచుకుని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బస్టాండ్ కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని చర్చించారు. ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ఎంఈఓ నారాయణ, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

27న వాహనాల వేలం

పెద్దతిప్పసముద్రం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 27న వాహనాల వేలం నిర్వహిస్తామని ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం తరలిస్తూ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తామని ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వారపు సంత వేలం

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోట వారపు సంత వేలం పాటలో రూ.1.21 లక్షల ఆదాయం వచ్చినట్లు సర్పంచు వై.విజయమ్మ, కార్యదర్శి ఆజాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములకలచెరువుకు చెందిన విశ్వనాథ్‌నాయుడు రూ.1.21 లక్షకు వేలం పాటలో దక్కించుకున్నట్లు వారు తెలిపారు.

రూ. 1.54 లక్షలు ఆదాయం

కేవీపల్లె : వారపు సంత వేలం ద్వారా ఎంపీపల్లె గ్రామ పంచాయతీకి రూ. 1.54 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం ఎంపీపల్లె గ్రామ సచివాలయంలో గుండ్రేవారిపల్లె క్రాస్ వారపుసంతకు సంబంధించి వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఖాసీంసాహెబ్ హెచ్చుపాట ద్వారా వారపు సంత గేటు వసూలు హక్కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చీరల వేలం

మదనపల్లె సిటీ: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి సమర్పించిన చీరలు వేలం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో బహిరంగ వేలం చేశారు. భక్తులు పోటీలు పడి చీరలు వేలంలో పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారి లడ్డూను బహిరంగ వేలం నిర్వహించగా ఉప్పు రామచంద్ర రూ.15 వేలు పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి నాగరాజ, లోకేష్, రమణ పాల్గొన్నారు.

నేడు రాయల్ క్రాఫ్ట్ బజారు ప్రారంభం

మదనపల్లె సిటీ: స్థానిక మిషన్‌కాంపౌండ్‌లో రాయల్ క్రాఫ్ట్ బజారును శనివారం ప్రారంభించనున్నట్లు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. చేనేత హస్తకళల ప్రదర్శన, అమ్మకాలు, కలంకారి శారీస్, వరంగల్ టవల్స్, కొండపల్లి బొమ్మలు, బెంగాల్‌శారీస్, హైదరాబాద్ పెరల్స్, శారీస్, సహరన్‌పూర్ ఉడ్, లాకర్ వేర్స్, బొంబాయి ఫ్యాన్సీ జ్యువెలరీ లభిస్తాయన్నారు. మదనపల్లె పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు రాయల్ క్రాఫ్ట్ బజారు సందర్శించి వస్తువులను కొనుగోలు చేయాలని కోరారు.

ఆశ్రమం పిల్లలకు అన్నదానం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులోని గార్డెన్ సిటీ ఆశ్రమంలో శుక్రవారం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఫౌండేషన్ సభ్యుడు తగాది మునిస్వామి స్నేహితుడి తండ్రి విశ్వనాథ్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఆశ్రమ చిన్నారుల సమక్షంలో జరుపుకున్నారు. అనంతరం పిల్లలకు స్వీట్లు, భోజన సౌకర్యం కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థికి తీవ్రగాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. మండలంలోని సీటీఎం పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు లోకేష్(20) వాల్మీకిపురం డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా దేవతానగర్ వద్ద మద్యం సేవించిన ఆటోడ్రైవర్ వేగంగా వచ్చి వాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో విద్యార్థి లోకేష్ తీవ్రంగా గాయపడ్డాడు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

మదనపల్లె : పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రాజానగర్‌లో కొందరు పేకాట ఆడుతున్నారని శుక్రవారం సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.3,950 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామసముద్రం: దిన్నిపల్లి గ్రామం సమీపంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో 2023-2024 విద్యాసంవత్సరానికి గాను మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఓ విజయలక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.6 వతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, అలాగే 9వ తరగతిలో మిగిలిన సీట్లు భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

ప్రజల భాగస్వామ్యంతోనే క్షయవ్యాధి నివారణ





రన్ ఫర్ టీబీ ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి, డాక్టర్ వెస్లీ తదితరులు, పీలేరులో టీబీ దినోత్సవ ర్యాలీ

మదనపల్లె : ప్రజల భాగస్వామ్యంతోనే క్షయవ్యాధి లేని సమాజ స్థాపన సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్.వెస్లీ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సీఎస్‌ఐ ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలో 'రన్ ఫర్ టీబీ' ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులతో కలిసి స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఎం.ఎల్.ఎల్ ఆస్పత్రి వరకు క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్షయ వ్యాధి నివారణలో ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ 110 ఏళ్లుగా రోగులకు సేవలందిస్తోందన్నారు. టీబీ నివారణలో భాగంగా ఆస్పత్రిలో 119 ఉచిత బెడ్‌లను అందుబాటులో ఉంచడంతో పాటుగా ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, నర్సింగ్, పారామెడికల్ కోర్సులు, రిసెర్చి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. నేషనల్ ట్యూబర్‌క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్(ఎన్‌టీఈపీ)లో భాగంగా రోగులకు ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. మందులు వాడిన ఆరునెలల తరువాత నెలకు రూ.500 చొప్పున రోగికి పౌష్టికాహారం నిమిత్తం అకౌంట్‌లో జమచేస్తున్నట్లు తెలిపారు. క్షయవ్యాధి లక్షణాలు కలిగిన వారు ముందుగానే అవసరమైన పరీక్షలు చేయించుకుని వ్యాధిని నయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ లక్ష్మీ, ఆర్‌ఎంఓ దివాకర్, డాక్టర్.నవీన్, డాక్టర్.బాబు, డాక్టర్.షీలా వెస్లీ, డాక్టర్.క్రిష్టినా, ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

– ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో దాతల సహకారంతో 46మంది క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టిక ఆహార కిట్స్‌ను మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.పద్మాంజలిదేవి, ఆర్‌ఎంఓ డాక్టర్.దివాకర్ చేతుల మీదుగా పౌష్టికాహారం అందజేశారు.

సమష్టి కృషితో క్షయవ్యాధిని అంతం చేద్దాం

పీలేరు : సమష్టి కృషితో క్షయవ్యాధిని అంతం చేద్దామని రాష్ట్రీయ బాల శిశు సంరక్షణ జిల్లా అధికారి డాక్టర్ శేషగిరిబాబు అన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షయవ్యాధి నిర్ధారణకు ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా గల్ల పరీక్ష చేయనున్నట్లు తెలిపారు. టీబీ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తోందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు మోహన్, కుసుమకుమారి, పవన్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత

కేవీపల్లె : క్షయవ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత అని గ్యారంపల్లె, గర్నిమిట్ట, జిల్లేళ్లమంద పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ ఉదయ్‌కిరణ్, డాక్టర్ శ్యామల, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మూడు పీహెచ్‌సీలలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధిని అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మ, డాక్టర్ పావని గౌరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ భయం వద్దు.. చికిత్స ముద్దు

వాల్మీకిపురం: టీబీపై భయం వీడి చికిత్స చేయించుకోవడం వలన మనిషి ఆరోగ్యంగా జీవిస్తారని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి గాంధీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు సోని, శ్రీలక్ష్మి, హర్షిత రెడ్డి, కిరణ్మయి, పిజిస్వామి, సూపర్‌వైజర్ నాగిరెడ్డి, శిఖామణి పాల్గొన్నారు.

టీబీ అంతమే లక్ష్యంగా పనిచేయాలి

కలకడ : టిబీ అంతమే లక్ష్యంగా ఆరోగ్యసిబ్బంది పనిచేయాలని ఎర్రకోటపల్లె, కలకడ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున అన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, వెంకటేశు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి

కలికిరి: క్షయ రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ లక్షణాలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, లక్షణాలున్న వారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చిన్నరెడ్డెప్ప, కావ్యగంధ, సీహెచ్‌ఓ ఇందిరాదేవి, ఎంపీహెచ్‌ఎస్ హేమలత, టి.బి.యూనిట్ వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

తంబళ్లపల్లె: టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాబాఫ క్రుద్దీన్ అన్నారు. సీహెచ్‌సీలో శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు గురించి వివరించారు. అనంతరం క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్ రామకృష్ణ, ఎల్‌టి యాదగిరి, ఐసిటీసీ కౌన్సిలర్ చందు, ఎల్‌బీ బాలాజీ, హెడ్‌నర్సు గ్లోరీ, సిబ్బంది పాల్గొన్నారు.

జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు

పెద్దమండ్యం : వేసవి దష్ట్యా జనసాంద్రత ఉన్న ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ శ్రీధర్‌రావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి తీవ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఉపాధిహామీ కూలీలు, రైతులు, వ్యవసాయ కూలీలకు గ్రామస్థాయిలో వడగాల్పులపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా వడదెబ్బకు గురైన వారికి తక్షణమే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఇమ్మాన్యుల్, ఏపీఓ మురళి, పంచాయతీ కార్యదర్శులు జగన్, శైలజ, ఖాదర్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

– ఎంపీపీ శ్రీదేవి

కలకడ : ప్రభుత్వం అందించే రాయితీ వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీదేవి, మండల వ్యవసాయశాఖ అధికారి గౌరి కోరారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. రైతులకు మూడు సంవత్సరాల కాలవ్యవధిలో రాయితీ నగదు చెల్లించడానికి మడకలు, మిల్లర్, వరికోత యంత్రాలు వంటివి అందిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ అధికారులు, రైతుభరోసా కేంద్రాల వద్ద ప్రతిరైతు పంటల సాగు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహాసంఘం సభ్యులు బయన్న, రెడ్డెప్ప, వెంకట్రమణ, ఏఈఓ రమణమ్మ పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాసదీక్షలు ప్రారంభం



తరావీ ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



వాల్మీకిపురం : విద్యుత్ అలంకరణలో మసీదు

మదనపల్లె సిటీ: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లింలు ఉపవాసదీక్షలను ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల వద్ద ఉపవాసదీక్షలు విరమించే సమయంలో చేపట్టే ఇఫ్తార్‌లతో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. సాయం సంధ్య వేళ చేపట్టిన ఇఫ్తార్‌లో సామూహికంగా ముస్లిం సోదరులు పాల్గొని సోదరభావం, సౌభ్రాతృత్వానికి పెద్దపీట వేశారు. రంజాన్‌మాసంలో రోజు వారి ఐదు పూటల నమాజులతో పాటు రాత్రి ఇషా నమాజ్ అనంతరం ప్రత్యేక తరావీ ప్రార్థనలు చేపట్టారు. ఇందులో మత గురువులు హాఫీజ్ సయ్యద్ ఇక్బాల్ సాహెబ్‌లు దివ్య ఖురాన్‌ను పఠించారు. మదనపల్లె పట్టణంలోని జామియా మసీదు, సల్మాన్‌ఫార్సీ, మోతీమసీదు, ఉస్మానే ఘనీ మసీదు, మక్కా,మదీనా మసీదులతో పాటు అన్ని మసీదులలోనూ సహరీ, ఇఫ్తార్‌లకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అంతటా రంజాన్ శోభ

వాల్మీకిపురం: ముస్లింలు పవిత్రంగా భావించే పవిత్ర రంజాన్ మాసం ఆగమనంతో అంతటా ప్రత్యేక శోభ సంతరించుకుంది. మండలంలోని వాల్మీకిపురం, చింతపర్తి, గండబోయనపల్లి, మంచూరు, మాధవరంపల్లి, పునుగుపల్లి, టీకలకోన, కూరపర్తి ప్రాంతాల్లోని మసీదుల్లో శుక్రవారం నుంచి రంజాన్ సందడి ప్రారంభమైంది. గురువారం సాయంత్రం రంజాన్ నెలవంక దర్శనంతో ఈ పవిత్ర మాసానికి సంబంధించిన ప్రత్యేకత తరావీహ (పవిత్ర ఖురాన్ పారాయణంతో కూడిన నమాజు) ప్రార్థనలను ప్రారంభించారు. సాయంత్రం మగ్రిబ్ నమాజ్ ముందు ఇఫ్తారీతో ఉపావాసాన్ని విరమించారు. ఈ నేపథ్యంలో పిల్లల నుంచి వృద్ధుల వరకు ఉపవాస దీక్షలను ఆచరించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మసీదులను ప్రత్యేక విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి సహకరించండి

– మంత్రికి ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ సభ్యుల వినతి



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి

మదనపల్లె : రాష్ట్రంలోనే అతిపెద్ద టమాట రెగ్యులేటెడ్ మార్కెట్‌యార్డుగా పేరుమోసిన మదనపల్లె మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకరించాలని మార్కెటింగ్‌శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో శుక్రవారం మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వెంకటరమణ, డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి వినతిపత్రం అందజేశారు. మార్కెట్‌యార్డులో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. మార్కెట్‌యార్డుకు ప్రతిరోజు 2,000 మందికి పైగా రైతులు, వ్యాపారులు, హమాలీలు వస్తుంటారని, వీరికి యార్డులో కేవలం ఒకే ఒక టాయిలెట్ బ్లాక్ ఉన్నందున, ప్రజా అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న దానికి అదనంగా మరో టాయిలెట్ బ్లాక్‌ను మంజూరు చేయాల్సిందిగా కోరారు. అలాగే వేసవికాలం, టమాట సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో మార్కెట్‌యార్డులో ప్రస్తుతం ఉన్న ఆర్వో ప్లాంటు సరిపోవడం లేదని, మరో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. మదనపల్లె-కదిరిరోడ్డు మార్గంలో యార్డుకు పశ్చిమవైపున ఖాళీస్థలం ఆక్రమణలకు గురవుతోందని, ఈ స్థలంలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కమర్షియల్ షాపు రూములు నిర్మిస్తే ఆస్తులను కాపాడుకోవడమే కాకుండా ఏడాదికి రూ.15-20 లక్షల వరకు అద్దెల రూపంలో మార్కెట్‌కమిటీకి ఆదాయం చేకూరుతుందని చెప్పారు. మార్కెట్‌కమిటీ సొంత నిధులతో వీటి నిర్మాణం చేపట్టేందుకు అనుమతి కోరుతూ కమిటీ సభ్యుల తీర్మానంతో అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిషనర్, డైరెక్టర్‌కు కడప ఆర్‌జేడీ ద్వారా నివేదిక పంపామని, దానిని పరిశీలించి పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయాల్సిందిగా కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

ములకలచెరువు: వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ అశ్వని, తహసీల్దార్ శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్యలపైన ఫిర్యాదులు అందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, వడ దెబ్బ తగలకుండా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైతే గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు ఆదేశించారు.

ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించాలి

ఎంపీడీఓ మహమ్మద్ ఖదీర్

కేవీపల్లె : ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు పారదర్శకంగా అందించాలని ఎంపీడీఓ మహమ్మద్ ఖదీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గర్నిమిట్ట గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ సర్వే కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సిగ్బతుల్లా, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రికార్డు స్థాయిలో ఆదాయం

- దినసరి, వారపుసంత, జంతువధశాల నిర్వహణకు వేలం
- మూడేళ్లుగా పెరుగుతున్న గేటు వసూళ్లు
- గతేడాదితో పోలిస్తే రూ.29.50 లక్షలు పెరిగిన ఆదాయం



దినసరి, వారపుసంతకు వేలం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ కే.ప్రమీల

మదనపల్లె : జిల్లాలో సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ అయినటువంటి మదనపల్లె మున్సిపాలిటీకి రికార్డు స్థాయిలో రూ.1.86 కోట్లు ఆదాయం వచ్చింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ కే.ప్రమీల అధ్యక్షతన 2023-24 ఆర్థిక సంవత్సరానికి దినసరి, వారపు సంత, జంతువధశాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో భాగంగా దినసరి కూరగాయల మార్కెట్‌ను పట్టణానికి చెందిన యాస్మీన్ రూ.1.30 కోట్లకు దక్కించుకున్నారు. గత వేలం పాటలతో పోలిస్తే ఈ ఏడాది రూ.17.50లక్షల అధికంగా ఆదాయం వచ్చింది. కాగా దినసరి మార్కెట్‌కు సంబంధించి 2020-21లో రూ.49లక్షలు, 2021-22లో రూ.85లక్షలు, 2022-23లో రూ.1.12 కోట్లు ఆదాయం లభిస్తే 2023-24కు రూ.1.30 కోట్లు వేలంపాటల ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చింది. అలాగే వారపుసంతకు సంబంధించి గత ఏడాది రూ.42.60లక్షలకు యాస్మీన్ పాడుకోగా, ఈఏడాది రూ.54 లక్షలకు అక్బర్‌బాషా దక్కించుకున్నారు. జంతువధశాలకు సంబంధించి గత ఏడాది రూ.1,68,000కు యాస్మీన్ వేలంపాటల్లో పాడుకుంటే ఈ ఏడాది రూ.2,25,000కు దక్కించుకున్నారు. ప్రైవేట్ బస్టాండ్లకు సంబంధించి ఎవరూ టెండర్ వేయకపోవడంతో వేలం వాయిదా వేశారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు ప్రభుత్వ గెజిట్‌లో నిర్ణయించిన ధరప్రకారం వసూళ్లు చేయాలని స్పష్టం చేశారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

వాల్మీకిపురం: గ్రామీణ ప్రాంతంలో నీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వడగాల్పులు, వడదెబ్బ, ఎండ వేడిమి నుంచి ఉపసమనం పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మా..కరుణించమ్మా..!

కురబలకోట: మండలంలోని ఎర్రబల్లె గ్రామం సింగన్నగారిపల్లెలోని సింతోటమ్మ (నామాలమ్మ) జాతర గురు, శుక్రవారాల్లో అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ సర్పంచ్ ఉప్పతి నాగరత్న, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పతి ఈశ్వర్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఊరేగింపు వైభవంగా సాగింది. చాందినీ బండ్ల మెరువన, కోలాటం, చెక్కల భజనతో పాటు కర్ణాటక నుంచి ప్రత్యేక సాంస్కృతిక కళా బృందం ప్రత్యేక ఆకర్శనగా నిలించింది. ఉట్ల ఉత్సవం కనుల పండగలాసాగింది.

సచివాలయాల్లో మెరుగైన సేవలు అందించండి

– డీఎల్‌డీఓ లక్ష్మీపతి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

మదనపల్లె : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరికీ పారదర్శకంగా అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. మండలంలోని వేంపల్లె సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో వివిధ పథకాలకు సంబంధించిన రికార్డులు, కార్యదర్శులు, వలంటీర్ల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ.. వేసవికాలంలో వడదెబ్బ నుంచి కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వే(ఎస్‌డీజీ)ను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. స్పందన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి, నివేదికను ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ఆయుష్మాన్ భారత్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

నాటుసారా తయారీపై ఉక్కుపాదం



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఈబీ సీఐ మల్లిక

ములకలచెరువు: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ములకలచెరువు సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో నాటుసారా తయారీపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి సీఐ ములకలచెరువు మండలం సోంపల్లె వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. నాటుసారా విక్రయాల్లో ఎక్కువ కేసులున్న వారిపై పీడీయాక్ట్‌కు సిఫార్సు చేస్తామన్నారు. ఎక్కువగా నాటుసారా వండే గ్రామాల్లో నిత్యం ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. సరిహద్దు చెక్‌పోస్టుల నుంచి మద్యం రవాణా నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

కలికిరి పంచాయతీకి రికార్డు స్థాయి ఆదాయం

కలికిరి: బహిరంగ వేలంలో కలికిరి గ్రామ పంచాయతీకి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరినట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి వారపుసంత, దినసరి మార్కెట్, జంతువధశాల, ప్రైవేటు బస్టాండ్ గేటు వసూలుకు మదనపల్లి డీఎల్‌పీఓ జయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలంలో వారపు సంత గేటు వసూలుకు పి.అశోక్ కుమార్ రెడ్డి రూ.15లక్షలు, దినసరి మార్కెట్ గేటు వసూలుకు ఎస్.రాజశేఖర్ రెడ్డి రూ.2.11లక్షలు, ప్రైవేటు బస్టాండ్‌కు ఎస్.రియాజ్ రూ.3.10లక్షలు, జంతువధ శాలకు ఎస్.షాహీర్ రూ.75వేలుకు దక్కించుకున్నారు. బహిరంగ వేలం ద్వారా రికార్డు స్థాయిలో మొత్తం రూ.20.96లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. ఈఓపీఆర్డీ ఆజాద్, సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, ఈఓ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

చెత్త సేకరణతోనే పంచాయతీలకు ఆదాయం

కలకడ : చెత్త సేకరణతోనే పంచాయతీలకు ఆదాయం, జగనన్న స్వచ్ఛ సంకల్ప పారిశుధ్య కార్మికులకు జీతాలు సాధ్యమని ఎంపీడీఓ నారాయణ అన్నారు. శుక్రవారం రాయచోటి డివిజన్, గాలివీడు మండలంలోని గాలివీడు, గోరన్‌చెరువు పంచాయతీలలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పారిశుధ్య కార్మికులు, పంచాయతీ కార్యదర్శులుకు తడిచెత్త, పొడి చెత్త సేకరణపై కలకడ చెత్తసేకరణ కేంద్రం వద్ద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలకడ సర్పంచ్ ప్యారీజాన్, వైఎస్సార్ నాయకుడు షావత్‌అల్లీఖాన్, జిలానీ, పంచాయతీ కార్యదర్శులు నందిని, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కలికిరి: మండలంలోని గుట్టపాళెం గ్రామం యాదలవాండ్లపల్లిలో దీర్ఘకాలంగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించినట్లు సర్పంచ్ రెడ్డివారి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ యాదలవాండ్లపల్లి తాగునీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే మూడు సార్లు బోర్లు తవ్వించినా నీరు లభించలేదు. గ్రామస్తుల ఆవేదన గుర్తించి మరోసారి తాగునీటి బోరు వేయించడంతో ప్రజాకాంక్ష మేరకు నీరు పుష్కలంగా లభించిందన్నారు.